

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఉత్తమ ఫలితాలతోనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ

● ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : పదో తరగతి విద్యార్థులు వంద శాతం పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ కె.నర్సిరెడ్డి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షలపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ప్రభుత్వ పాఠశాలలు మనుగడ ఉంటుందని తెలిపారు.

రామన్నపేటలో 'పులి' పుకార్లు?

హైనా ఆనవాళ్లంటున్న అధికారులు

రామన్నపేట, ఫిబ్రవరి 3 : రామన్నపేట పరిసర ప్రాంతంలో శుక్రవారం పులి తిరుగుతుందనే వార్తతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పులి ట్రాక్ దాటుతుండడం చూశానని గూడ్స్ రైలు గార్డ్ రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అనుమానిత ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేశారు. కొమ్మాయిగూడెంలో సైతం ఓ రైతు శుక్రవారం రాత్రి పులిని చూశానని అధికారులకు తెలుపడంతో అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో ట్రాకింగ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. రైతు పులి కనిపించిందని చెప్పిన ప్రదేశంలో అడుగులను పరిశీలించారు, అధికారులు గుర్తించిన అడుగుల్లో గోర్ల ఆనవాళ్లు ఉన్నాయి. అయితే పులి అడుగుల్లో గోర్ల ఆనవాళ్లు ఉండవు అనేది అధికారుల అభిప్రాయం.

అటవీశాఖ అధికారులు గుర్తించిన అడుగు

వీర్లదేవి చెరువు ఆనకట్టను నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బేతవోలు చెరువు ఆనకట్ట నిర్మాణం

చిలుకూరు, ఫిబ్రవరి 3 : మండల పరిధిలోని బేతవోలు వీర్లదేవి చెరువు అలుగు ఆనకట్టను శనివారం నిర్మించారు. గతంలో రైతులు చెరువు ఆనకట్ట ఎత్తు ఎక్కువగా ఉండడంతో తమ పంట పొలాలు మునుగుతున్నాయని పేర్కొంటూ కూల్చేశారు. దాంతో చెరువు ఆనకట్టను నిర్మించాలని కోరడంతో శనివారం అధికారులు వచ్చి అలుగు నిర్మాణం చేశారు. సాగర్ నీటితో చెరువును నింపాలని రైతులు కోరారు. భవిష్యత్‌లో ఎవరైనా చెరువుల తూములను బ్లాస్టింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు, పోలీసులు హెచ్చరించారు. ఎన్ఎస్‌పీ డీఈ స్వప్న, ఏఈ మానస, ఎస్ఐ శ్రీనివాస్‌యాదవ్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ద్వారకుంట పాఠశాల విద్యార్థులు

మేధోశక్తి పెంపునకు టాలెంట్ టెస్ట్‌లు దోహదం

● జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అందె సత్యం

మునగాల, ఫిబ్రవరి 3 : టాలెంట్ టెస్ట్‌లు విద్యార్థుల మేధోశక్తి పెంపునకు ఎంతగానో దోహద పడుతాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అందె సత్యం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు, చేతబడి వంటి నమ్మకాలను తొలగించడానికి ప్రయత్నించడం గొప్ప విషయమన్నారు. తెలుగు మీడియంలో జడ్పీహెచ్ఎస్ దొరకుంట విద్యార్థులు (ప్రథమ), టీఎస్ఆర్‌జేసీ తుంగతుర్తి విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో (ప్రథమ) స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందూనరేందర్‌రెడ్డి, ఎంఎస్ విద్యా సంస్థల చైర్మన్ నాగిరెడ్డి, రమేశ్‌బాబు, స్వామి, దుర్గాప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో పాలవరం విద్యార్థుల ప్రతిభ

బహుమతులు అందుకుంటున్న పాలవరం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

అనంతగిరి, ఫిబ్రవరి 3 : మండలంలోని పాలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ (తెలుగు మీడియం)లో ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. పాఠశాలకు చెందిన మణికుమారి (ప్రథమ), భవాని (ద్వితీయ) స్థానంలో నిలిచారు. విజేతలకు సోషల్ స్టడీస్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య నగదు బహుమతులు అందజేశారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షలపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వరకు జరిగే పరీక్షలకు ప్రత్యేక కార్యాచరణతో విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధ వహించాలని సూచించారు. ఆచార్య కూరెళ్ల విఠలాచార్యకు పద్మశ్రీ రావడం గురుకులానికే గర్వకారణమని, వారి వద్ద విద్యనభ్యసించిన వారు ఇప్పుడు ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో మనోధైర్యం నింపి ప్రోత్సహించాలన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల కోసం తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఈఓ నారాయణరెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

7 నుంచి 15వరకు పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు

భువనగిరి కలెక్టరేట్ : ఈనెల 7 నుంచి 15 వరకు పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ హనుమంతు కె జెండగే తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ(సీతక్క) శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమంతు కె జెండగే మాట్లాడారు. జిల్లాలో 421 గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని, శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ చేపడుతామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి భవిష్యత్‌ను నిర్ణయించేది సాంఘికశాస్త్రమే

● సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య

సాంఘికశాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష ప్రశ్నా పత్రాలను విడుదల చేస్తున్న సోషల్ ఫోరం ఉపాధ్యాయులు

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 3 : తరగతి గదిలోనే కాకుండా సమాజంలో ప్రతి విద్యార్థి భవిష్యత్‌ను నిర్ణయించేది సాంఘిక శాస్త్రమే అని తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రామినేని వెంకటయ్య అన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక, భౌగోళిక, రాజకీయంగా సాంఘిక శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ నిర్వాహకుడు పగడాల ఉపేందర్‌రెడ్డి, సెక్రెటరియల్ అధికారులు జనార్దన్, ప్రతాప్, శ్రవణ్, సోషల్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు జి.సైదులు, సంఘమిత్ర, శ్రీనయ్య, ట్రెజరర్ బొజ్జ మెరిల్లా, కార్యదర్శులు కృష్ణవేణి, అమర్, కర్నాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

● ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగయ్య

బొడ్రాయిబజార్ : బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 3 : బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంటా నాగయ్య పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో గ్రామీణ భారత్ బంద్ పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, ప్రగతిశీల ఆటో మోటార్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుంటి మరళి, హమాలీ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకుడు ఒగ్గు వెంకన్న పాల్గొన్నారు.

పాలకవీడు : కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు అనంతప్రకాశ్ కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ దయాకర్‌కు సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేరేడుచర్ల : దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రాంమూర్తి అన్నారు. సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రవాణా రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

గర్భిణులు టీకాలు తీసుకోవాలి

● వైద్య సిబ్బంది

నూతనకల్, ఫిబ్రవరి 3 : గర్భిణులు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాలని వైద్య సిబ్బంది అన్నారు. మండలంలోని ఎర్రపహాడ్, పెదనెమిల, తాళ్లసింగారం, వెంకేపల్లి, మాచనపల్లి, బిక్కుమళ్ల గ్రామాల్లోని సబ్ సెంటర్లలో శనివారం గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యాపేటలో 15న సామాన్యుడి సమరభేరి

● ఆప్ నాయకులు

సామాన్యుడి సమరభేరి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆప్ నాయకులు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 3 : ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 15న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిరుమల గ్రాండ్ హోటల్‌లో నిర్వహించే సామాన్యుడి సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో సమరభేరి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, డాక్టర్ అన్సారీ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సూరారపు పరీక్షన్‌రాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు జూలూరి మమత, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు తక్కెళ్లపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచులకు సన్మానం



మునగాల : వెంకటరామాపురం తాజా మాజీ సర్పంచ్ రమాశ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

మునగాల, ఫిబ్రవరి 3 : మండలంలోని వెంకటరామాపురం తాజా మాజీ సర్పంచ్ దొంగరి రమా దంపతులను శనివారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సర్పంచ్ రమ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ తొగరు సీతారాములు, సీనియర్ నాయకుడు సుంకర అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని గౌసుకొండ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం కైతాపురం గ్రామానికి చెందిన కందగట్ల జంగారెడ్డి(38) పోచంపల్లి నుంచి బట్టుగూడం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. గౌసుకొండ నుంచి పోచంపల్లికి లైట్ లేకుండా గడ్డిలోడ్‌తో ట్రాక్టర్ వస్తుంది. గ్రామ శివారులోకి రాగానే జంగారెడ్డి ట్రాక్టర్‌ను ఎదురుగా ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ

తుంగతుర్తి, ఫిబ్రవరి 3 : సీపీఎం సీనియర్ నాయకుడు వర్దెల్లి రాములు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. శనివారం కరివిరాల కొత్తగూడెంలో ఆయన కుమారులు శ్రీహరి, కృష్ణను జడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్ పరామర్శించారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

మునగాల/ అర్వపల్లి, ఫిబ్రవరి 3 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అర్హులైన గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవాలని మునగాల, అర్వపల్లి తాసీల్దార్లు ఆంజనేయులు, జక్కర్తి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11,నవంబర్ 2020 కంటే ముందు పట్టభద్రులై ఉన్నవారు ఈ నెల 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు జాజిరెడ్డిగూడేనికి ఎమ్మెల్యే మందుల సామేల్ రాక

అర్వపల్లి, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరు కానున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు మోరపాక సత్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కిరాణ దుకాణం ఎదుట రైతుల ఆందోళన

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 3 : పచ్చ రంగులు వేసి జొన్నలు అంటగంటారని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణం ఎదుట పలువురు రైతులు శనివారం ఆందోళన నిర్వహించారు. రంగు వేసిన జొన్నల వల్ల పంట సరిగా పండక నష్టపోయామని వారు వాపోయారు. పెట్టుబడులు కూడా రాలేదని దుకాణ యజమాని నుంచి తమకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.

5న మిట్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా

చిలుకూరు, ఫిబ్రవరి 3 : ఈ నెల 5న మండల పరిధిలోని మిట్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం శనివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. యాడ్ ఎకో కంపెనీ వారు కళాశాలలో ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి వెల్లడించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

వలిగొండ, ఫిబ్రవరి3 : అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ప్రొద్దుటూర్‌కు చెందిన రంగరాజు ఆనంద్‌కుమార్(52) మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాలోని శామీర్‌పేట మండలంలోని తూముకుంటలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన తల్లి ఇటీవల మృతి చెందడంతో అంత్యక్రియల కోసం కుటుంబంతో కలిసి గ్రామానికి వచ్చాడు. కొద్దిరోజుల క్రితం భార్య శిరీష, కొడుకు సాయితేజను తుముకుంటకు పంపించాడు. శుక్రవారం రాత్రి ఆనంద్‌కుమార్ మృతి చెందడంతో కుటుంబసభ్యులు భార్య శిరీషకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ మహేంద్రనాథ్

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

అర్వపల్లి, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నేషనల్ రోడ్డు సేఫ్టీ మంత్‌లో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు క్రాసింగ్, సెల్‌ఫోన్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేంద్రనాథ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

మఠంపల్లి, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని రాజీవ్ కాలనీలో గల కానుక మాత దేవాలయం సిల్వర్ జూబ్లీ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శుభవార్త దేవాలయం విచారణ గురువులు ఫాదర్ మార్టిన్ పసల, బహుమతుల దాతలు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి శౌరీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూసారం వృద్ధి : కేవీకే ఇన్‌చార్జి పీసీ నరేశ్

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే ఇన్‌చార్జి నరేశ్

గరిడేపల్లి, ఫిబ్రవరి 3 : ప్రకృతి వ్యవసాయంతోనే భూసారం వృద్ధి జరుగుతుందని గడ్డిపల్లి కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్ అన్నారు. మండలంలోని గారకుంటతండాలో శనివారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం రైతులు అధిక మోతాదులో ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం వల్ల ఖర్చులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందడమే కాక ఖర్చులు తగ్గనున్నట్లు చెప్పారు. కేవీకే శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ సహజ వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, సేంద్రియ ఎరువుల లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆదర్శ్, మాజీ సర్పంచ్ బాబూనాయక్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

● హెచ్ఎం శివయ్య

విద్యార్థులకు స్టీల్ గ్లాసులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నూతనకల్, ఫిబ్రవరి 3 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించాలని పెదనెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శివయ్య అన్నారు. శనివారం పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సామ రాజశేఖర్‌రెడ్డి, సామ రాకేశ్‌రెడ్డి తమ తండ్రి మల్లారెడ్డి జ్ఞాపకార్థం ప్రభుత్వం అందించే రాగి జావ తాగేందుకు గ్లాసులు అందించగా పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చురకంటి మధు పాల్గొన్నారు.

టెంట్‌హౌజ్ ఓనర్స్ అసోసియేషన్ కమిటీ

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 3 : సూర్యాపేట పట్టణ టెంట్‌హౌజ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యాపాల వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరవ అధ్యక్షులుగా కల్కూరి ప్రేమ్‌సాగర్, గూట్ల కిశోర్‌బాబు, ఉపాధ్యక్షులుగా పొలగాని కృష్ణ, పిడమర్తి శంకర్, ప్రధాన కార్యదర్శిగా సయీద్‌బిన్ అబూద్, కోశాధికారిగా మిడసనమెట్ల మురళి, సహాయ కార్యదర్శిగా గోనె సందీప్, కార్యవర్గ సభ్యులుగా నాగబండి జీవన్‌కుమార్, తాళ్లపల్లి సైదులుగౌడ్, ఎం.డి.తాహేర్, కట్కూరి శేఖర్‌రెడ్డి, యలగందుల రమేశ్‌లు ఎన్నికయ్యారు.

మహిళా వైద్యాధికారులకు సన్మానం

నేరేడుచర్లలో మహిళా వైద్యాధికారులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 3 : జాతీయ మహిళా వైద్యాధికారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నేరేడుచర్ల మండల వైద్యాధికారులు పున్న నాగిని, ఎర్రమాల సీతామహాలక్ష్మి, రాయల శృతిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, బట్టు మధు, కొణతం సీతారాంరెడ్డి, గుండా సత్యనారాయణ, రాచకొండ శ్రీను, కట్టా శ్రీనివాస్ రెడ్డి, నీల శ్రీను, కర్రి సూర్యనారాయణరెడ్డి, యారవ సురేశ్, శంకరాచారి పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్ వద్ద మహిళా ఆత్మహత్యాయత్నం

● అడ్డుకున్న పోలీసులు

లేబర్ ఆఫీసర్ కాళ్లు మొక్కుతున్న బుడిగ నిర్మల

సూర్యాపేట, ఫిబ్రవరి 3 : బీమా డబ్బులు రాకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఓ మహిళ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలు బుడిగ నిర్మల తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం గ్రామానికి చెందిన బుడిగ వెంకటయ్య భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ 18 నెలల క్రితం చనిపోయాడు. అయనకు లేబర్ కార్డు ఉండడంతో కార్మిక శాఖ నుంచి రావాల్సిన బీమా డబ్బుల కోసం కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. నాటి నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నగదు రాకుండా అడ్డుకుంటున్నాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో వెంకటయ్య కోడలు నిర్మల శనివారం కలెక్టరేట్‌కు పెట్రోల్‌తో వచ్చి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. పోలీసులు అడ్డుకుని ఆమె వద్ద నుంచి పెట్రోల్ బాటిల్ తీసుకొని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. విచారణ జరిపి న్యాయం చేస్తానని అదనపు కలెక్టర్ చెప్పడంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నియామక పత్రం అందుకుంటున్న రమేశ్

టీఎంహెచ్ఓసీఈయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమేశ్

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 3 : తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్(టీఎంహెచ్ఓసీఈయూ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సూర్యాపేట జిల్లాకు చెందిన లాదినేని రమేశ్ నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రమేశ్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీఉద్దీన్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శాంతికుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ భిక్షపతి, రాష్ట్ర ట్రెజరీ సుభాశ్ పాల్గొన్నారు.